# విశ్వాసం తరుగుట, పెరుగుట

عَنْ حَنْظَلَةَ الْأُسَيِّدِيِّ ﵁ قَالَ: قَالَ رَسُولُ الله ﷺ: **(وَالَّذِي نَفْسِي بِيَدِهِ إِنْ لَوْ تَدُومُونَ عَلَى مَا تَكُونُونَ عِنْدِي وَفِي الذِّكْرِ لَصَافَحَتْكُمْ الْمَلَائِكَةُ عَلَى فُرُشِكُمْ وَفِي طُرُقِكُمْ وَلَكِنْ يَا حَنْظَلَةُ سَاعَةً وَسَاعَةً)** ثَلَاثَ مَرَّاتٍ.

44- ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారని హంజలా ఉసయ్యిదీ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః "**నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆయన సాక్షి! నా వద్ద ఉన్నప్పుడు మీరు ఎలా ఉంటారో అలాగే ఎల్లప్పుడూ ఉన్నట్లయితే మరియు అల్లాహ్ స్మరణలోనే ఉన్నట్లయితే, మీరు మీ పడకలపై ఉండగా, దారిలో నడుస్తుండగా దైవదూతలు వచ్చి మీతో కరచాలనం చేసేవారు. కాని ఓ హంజలా! కొంత దైవ ధ్యానం మరి కొంత ఆలుపిల్లల భాధ్యత భారం తప్పదు**". ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ చివరి మాట మూడు సార్లు అన్నారు. (ముస్లిం 2750).

*ఈ హదీసులో:*

విశ్వాసుని స్థితి అన్ని వేళల్లో ఒకేరకంగా ఉండదు. ఒకప్పుడు అశ్రద్ధ ఏర్పడుతుంది. సహచరుల అతి ఉత్తమ సందర్భం ప్రవక్త సన్నిధిలో ఉన్నప్పటిది. మనిషి నుండి పాపం జరుగుట తప్పని సరే. ఇలా స్వాతిశయం, అహంభావం దూరమయి, దైవదాస్యం లో ఉన్నత స్థానం లభించుటకు మరియు మనిషి అల్లాహ్‌తో క్షమాభిక్ష కోరుతూ ఉండుట కోసం. తాను కోరిన దానిని సృష్టిం- చడం, లేదా నశింపజేయడం అల్లాహ్ కు చాలా సులువు.

عَنْ عَبْدِ الله بْنِ عَمْرِو بْنِ الْعَاصِ ﵄ قَالَ : قَالَ رَسُولُ الله ﷺ: **(إِنَّ الإِيمَانَ لَيُخْلَقُ فِي جَوفِ أَحَدِكُمْ كَمَا يُخْلَقُ الثَّوبُ الخَلَقُ ، فَاسْأَلُوا اللهَ أَنْ يُجَدِّدَ الْإِيمَانَ فِي قُلُوبِكُم) .**

45- ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారని అబ్దుల్లాహ్ బిన్ **అమ్ర్** రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: "**నిశ్చయంగా మీ దుస్తులు పాతబడినట్లు మీలోని మీ విశ్వాసం కూడా పాతబడుతుంది. అందు చేత అల్లాహ్ మీ విశ్వాసాన్ని నూతనంగా, తాజాగా ఉంచాలని మీరు ఆయన్ని ప్రార్థిస్తూ ఉండండి**". (ముస్తద్రక్ హాకిం 5. సహీహ 1585).

*ఈ హదీసులో:*

పాపంతో విశ్వాసం బలహీనపడుతుంది. అశ్రద్ధ వల్ల అది హృదయంలో పాతబడుతుంది. బట్టను ఉతికి కొత్తదనానికి తీసుకొచ్చే పద్ధతిలో, అల్లాహ్ స్మరణం (**జిక్ర్**), దుఆ, ఖుర్‌ఆన్ పారాయణం, సత్కర్మల ద్వారా దానిని పునరుద్ధరించాలి. విశ్వాసంపై నిలకడగా ఉండుటకు, అది పెరుగుతూ ఉండుటకు, అదే స్థితిలో చచ్చే పరియంతరం ఉండుటకు అల్లాహ్‌తో దుఆ చేస్తూ ఉండాలి.

عَنْ أَبِي هُرَيْرَةَ ﷺ يَقُولُ: قَالَ رَسُولُ الله ﷺ: **(إِذَا زَنَى الرَّجُلُ خَرَجَ مِنْهُ الْإِيمَانُ كَانَ عَلَيْهِ كَالظُّلَّةِ فَإِذَا انْقَطَعَ رَجَعَ إِلَيْهِ الْإِيمَانُ).**

46- ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించారని అబూ హురైర రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః "**ఒక వ్యక్తి వ్యభిచారం చేస్తున్నప్పుడు అతని నుండి విశ్వాసం బయటకు వెళ్ళి, అతనిపై నీడ మాదిరిగా ఉండిపోతుంది. ఆ దుష్కార్యం వదలినప్పుడు విశ్వాసం తిరిగి అతని వైపు వచ్చేస్తుంది**". (అబూ దావూద్ 4690, తిర్మిజి 2625. సహీహ 509).

*ఈ హదీసులోః*

పాపాల నష్టం తెలుపబడింది. దాని వలన సంపూర్ణ విశ్వాసం లో కొరత ఏర్పడుతుంది. ఒక్కోసారి విశ్వాసం ప్రక్కకు జరిగిపోతుంది. 'పాపం వల్ల విశ్వాసానికి ఏ నష్టం వాటిల్లద'ని చెప్పే "ముర్జియా" వర్గం వారి సిద్ధాంతాల ఖండన ఇందులో జరిగింది. "నీడ మాదిరిగా ఉండిపోతుంది" అని సులభంగా అర్థమయ్యే మంచి సామెత ఇవ్వబడింది. పాప కార్యాల్లో వ్యభిచారం అతి నీచమైనది, చెడ్డది. పాపాల నుండి దూరముంటూ, స్వచ్ఛమైన తౌబా చేస్తూ విశ్వాసం కోల్పోకుండా చాలా జాగ్రత్తగా ఉండాలి.

عَنْ أَبِي هُرَيْرَةَ ﷺ أَنَّ رَسُولَ الله ﷺ قَالَ: **(لَا يَزْنِي الزَّانِي حِينَ يَزْنِي وَهُوَ مُؤْمِنٌ وَلَا يَشْرَبُ الْخَمْرَ حِينَ يَشْرَبُ وَهُوَ مُؤْمِنٌ وَلَا يَسْرِقُ السَّارِقُ حِينَ يَسْرِقُ وَهُوَ مُؤْمِنٌ وَلَا يَنْتَهِبُ نُهْبَةً يَرْفَعُ النَّاسُ إِلَيْهِ فِيهَا أَبْصَارَهُمْ وَهُوَ مُؤْمِنٌ).**

47- ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సెలవిచ్చారని అబూ హురైర రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః "**వ్యభిచారి వ్యభిచారం చేస్తున్నప్పుడు**

**విశ్వాసిగా ఉండడు. త్రాగుబోతు మధ్యం సేవిస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. దొంగ దొంగతనం చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. ప్రజలు కళ్ళారా చూస్తుండగా దోపిడి దొంగ పెద్ద ఎత్తున లూటీ చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు**". (బుఖారి 5578, ముస్లిం 57).

### *ఈ హదీసులోః*

ఘోరపాపాలు సంపూర్ణ విశ్వాసంలో లోటు కలుగజేస్తాయి. సంపూర్ణ విశ్వాసంగల వ్యక్తిని అతని విశ్వాసం పాపాల నుండి, అవిధేయత నుండి కాపాడుతుంది. ఘోరపాపాలకు సమీపించే వారికి ఇందులో కఠినంగా హెచ్చరిక ఉంది. పాపాలు రెండు రకాలుగా ఉంటాయిః చిన్నవి మరియు పెద్దవి.